

రేపు వన మహోత్సవం

కలెక్టరేట్ ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవుతారని చెప్పారు. ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ వేత్తలు, విద్యాసంస్థల యజమానులు పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అన్నిచోట్ల మొక్కలు నాటేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమస్యలు ఏకరువు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ విజయ

- ఒకే అధికారి పది బాధ్యతలు నిర్వహిస్తే ఎలా? ● ఎరువులు పూర్తిస్థాయిలో లేవు ● రైతులతో మేము మాటకాస్తున్నాం
- సాగునీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేదు ● జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జడ్పీ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన, కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ సమక్షంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వ్యవసాయ, ఇరిగేషన్, డ్వామా, హెల్త్, ఏపీఎస్ఐడీసీ, హౌసింగ్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, డ్వామా పీడీ చిట్టిరాజ, డీఎంహెచ్‌వో మీనాక్షి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు పూర్తిస్థాయిలో లేవు..



నీటిపారుదల శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు లేవు. ఉన్న ఉద్యోగులు కూడా రెగ్యులర్ కాదు. ఓ డీఈ ఏకంగా పది పోస్టులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రైతులకు సీజన్‌లో అవసరమైన ఎరువులు, డీఏపీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు. ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రైతులతో మేము మాటకాస్తున్నాం. ఆమదాలవలస, నరసన్నపేట రైతులకు ఎరువులు తక్షణ అవసరం. టెక్కలికి అంత ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు. సాగునీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. ఈనాటికీ నా సొంత గ్రామానికి సాగునీరు అందడంలేదు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జైకా నిధులు రూ.40 కోట్లు మంజూరు చేయించాను. గత ఐదేళ్ల ఇందులో రూ.10 కోట్లు కూడా ఖర్చుచేయలేదు. లస్కర్లు పూర్తిస్థాయిలో లేరు. ఓనిగెడ్డ పరిస్థితి అధ్వానంగా ఉంది. వాస్తవంగా సాగునీటి ప్రాజెక్టుల కంట్రోల్ వ్యవస్థ శ్రీకాకుళంలో ఉండాలి. నాగావళి కరకట్టల విషయంలో గతంలో నకిలీ బ్యాంకు గ్యారెంటీ సమర్పించిన కాంట్రాక్టరుపై క్రిమినల్ కేసు ఎందుకు నమోదుచేయలేదో అధికారులు సమాధానం ఇవ్వాలి. పై నుంచి వరదలొస్తే బూర్జ మండలంలో ఇబ్బందికరంగా మారుతుంది. కార్మికుల కోసం ఈఎస్ఐ ఆసుపత్రిని రణస్థలంలో ఏర్పాటుచేయాలి. అర్హులైన దివ్యాంగులు పింఛన్లు పొందేందుకు సదరంలో ధ్రువపత్రాలు ఇవ్వాలి. వంశధార నిర్వాసితులు ఉన్న ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలి. చట్టాల్ని సక్రమంగా అమలుచేయని అధికారులపై కోర్టుకు వెళ్తాను. ఆమదాలవలస నియోజకవర్గం కొరగాంలో హైస్కూల్ కోసం భవనం నిర్మించారు. కానీ, స్కూల్ ఊరిలో లేకుండా చేసేశారు. వెంటనే టీచర్లను అక్కడ నియమించాలి. ఉపాధిహామీ క్షేత్రసహాయకులను బదిలీచేయడమో, లేదా పక్క మండలాలకు పంపడమో చేస్తే కొంత ప్రక్షాళన జరుగుతుంది. 2014 నుంచి 2019 వరకు చేపట్టిన అభివృద్ధి పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లుల చెల్లింపు నిలిపివేసింది. ఈ విషయమై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

-కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

తాగు, సాగునీరు అందడం లేదు..



పాతపట్నం నియోజకవర్గంలోని హిరమండలం రిజర్వాయర్, వంశధార నది నుంచి ఇతర ప్రాంతాలకు తాగు, సాగునీటిని తీసుకెళ్తున్నారు. కానీ, మా నియోజకవర్గ ప్రజలు మాత్రం అవి అందక అవస్థలు పడుతున్నారు. వారికి నీరు అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి అమలు చేయాలి. గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ పరిధిలో ఐదు చోట్ల వంతెనలు కూలిపోయే దశలో ఉన్నాయి. హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టిలో ఎరువులు కొరత తీవ్రంగా ఉంది. నివగాం గ్రామంలో వంశధార నది దిశ మారిపోయింది. వంశధార నిర్వాసితులు మెట్టు భూమిలో సాగుచేసుకుంటున్నారు. ఒక్క పరిశ్రమ కూడా మా నియోజకవర్గంలో లేదు. ఎత్తిపోతల పథకాలు నిలిచిపోయాయి. దండుపురం గ్రామంలో గత ప్రభుత్వంలో 44 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో కేవలం రూపాయి చొప్పున జమచేశారు. ఆ తర్వాత అదనంగా ఏమీఇవ్వలేదు. ఎల్ఎన్‌పేట మండలం చిన్నకొల్లివలస గ్రామంలో అంగన్వాడీ కేంద్రం కోసం నిర్మించిన పునాదిని చూపిస్తూ జగనన్న ఇళ్ల కింద రూ.44వేల బిల్లును చెల్లించేశారు. ఇటువంటివాటిపై దర్యాప్తు జరపాలి.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

రైతులు ఇబ్బందులు పడుతున్నారు..



మా నియోజకవర్గంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న ఎరువుల ధరలకు, ప్రైవేట్ సంస్థల ద్వారా లభించే ఎరువుల ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుంది. నాణ్యమైన పురుగు మందులు లభించడంలేదు. గత ఐదేళ్ల సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. వంశధార ఎడమకాలువ సంగతిని వదిలేశారు. స్లూయిస్ లేకపోవడంతో నీరు బయటకు పోతుంది. షట్టర్లను తక్షణమే అమర్చాలి. పూర్తిస్థాయిలో లస్కర్లను నియమించాలి. వారికి సకాలంలో జీతాలు చెల్లించాలి.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే నరసన్నపేట

గిరిజన విద్యార్థులను పట్టించుకోరా?



వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఇటీవల గిరిజన విద్యార్థులు విషజ్వరాలతో మృతిచెందారు. ఇదేరీతిన బీసీ విద్యార్థులు మరణించి ఉంటే ఆ వర్గ ఎమ్మెల్యేలు ఊరుకునేవారా?. అధికారులు ఆగేవారా? గిరిజన విద్యార్థులను పట్టించుకోరా?. మలేరియాతో ఎంతమంది మరణించారో నివేదిక ఉందా?. పాలకొండ నియోజకవర్గంలో శివారు భూములకు సాగునీరు అందడంలేదు. ఇరిగేషన్ అధికారులు శ్రీకాకుళంలో కొంతమంది, బొబ్బిలిలో మరికొంతమంది ఉంటున్నారు. వరదలు సంభవించకుండా పూర్తిగా చర్యలు తీసుకోవడం లేదు. భామిని మండలంలో 43 మంది రైతులకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాల్సిఉంది. సీతంపేట ఐటీడీఏలోని డీడీ ఆఫీసును శ్రీకాకుళానికి తరలిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇందులో నిజమెంతో కలెక్టరే బదులివ్వాలి.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

తీరం కొట్టుకుపోతుంది



గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రంలో వలంటీర్లను పక్కనబెట్టుకుని ఎరువులు పంపిణీ చేసేవారు. ఇప్పుడు మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ఆదేశాలతో రైతులందరికీ ఎటువంటి పక్షపాతం లేకుండా ఎరువులు లభిస్తున్నాయి. శ్రీకాకుళం నియోజకవర్గంలో వంశధార, నాగావళి నదుల వరద ఉధృతికి సువిశాలమైన తీరం కొట్టుకుపోతుంది. అలాగే, పెదగనగళ్లవానిపేట గ్రామం కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. చాలాచోట్ల ఆక్రమంగా చెరువులు ఉన్నాయి. వాటిని తొలగించాలి. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనం చేసిన గ్రామాల్లో ఉపాధి పనులు లేవు. వత్సవలస, బందరువానిపేట గ్రామస్థులకు జాబ్‌కార్డులే మంజూరుచేయలేదు. ఈ ప్రాంతాల్లో సముద్ర తీరం ఉందని ఉపాధి పనులు కల్పించడంలేదు. మరో ప్రాంతంలోనైనా పనులు కల్పించాలి. పక్షవాతం బారినపడిన వారికి సదరంలో ధ్రువపత్రాలు మంజూరు చేయడంలేదు. దీనివల్ల అర్హులకు పింఛన్లు మంజూరుకావడంలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

అన్నింటిపై సమగ్రంగా చర్చిస్తాం..

జిల్లాలోని సమస్యలపై ఎమ్మెల్యేలు చెప్పిన ప్రకారం వ్యక్తిగతంగా పరిశీలిస్తా. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం. త్వరలో ఇరిగేషన్ డవలప్‌మెంట్ బోర్డు సమావేశం నిర్వహించి చర్చిస్తాం. ఇటు ఉపాధిహామీ పనులు.. ఇరిగేషన్ పనులపై పరిశీలిస్తాం. ప్రభుత్వస్థాయిలో మంజూరు కోసం ప్రతిపాదనలు పంపుతాం.

-స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్, శ్రీకాకుళం

ఇద్దరితోనే పని చేయిస్తున్నారు..

వంశధార సబ్‌డివిజన్ కార్యాలయం హిరమండలంలో ఉంది. కానీ, సిబ్బంది మాత్రం ఒక్కరూ ఇందులో ఉండటం లేదు. గత ఐదేళ్లకాలంలో గొట్టాబ్యారేజీపై కనీసం విద్యుత్ దీపాలను కూడా అమర్చలేదు. 23 మంది సిబ్బంది అవసరముండగా ఇద్దరితోనే పనిచేయిస్తున్నారు.

-పాగిరి బుచ్చిబాబు, జడ్పీటీసీ సభ్యుడు, హిరమండలం



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

డీజీపీని కలిసిన ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్, ఆగస్టు 28: విశాఖపట్నం వచ్చిన డీజీపీ ద్వారకా తిరుమలరావును బుధవారం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

తెలుగుకు వెలుగు

- వ్యవహారిక భాష కోసం కృషి చేసిన గిడుగు
- ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన రామ్మూర్తి
- నేడు తెలుగు భాషా దినోత్సవం



ఎచ్చెర్ల/సరుబుజ్జిలి, ఆగస్టు 28: తెలుగు వ్యవహారిక భాష కోసం జీవితాంతం కృషిచేశారు ఆయన.. భాషా ఉద్యమంలో చిచ్చర పిడుగుగా పేరొందారు. ఆయన చేసింది బడిపంతులు ఉద్యోగమే అయినా మాటల కందని అద్భుతాలు సాధించారు. ఆయన ఎవరో కాదు. సిక్కోలు ఖ్యాతిని, తెలుగు భాష ఔనత్యాన్ని చాటిన మహానుభావుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు. గురువారం తెలుగు భాషా దినోత్సవం(గిడుగు రామ్మూర్తి జయంతి) సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

సరుబుజ్జిలి మండలం పర్వతాలపేటలో 1863 ఆగస్టు 29న వెంకమ్మ, వీర్రాజు దంపతులకు గిడుగు రామ్మూర్తి జన్మించారు. గిడుగు ప్రాథమిక విద్యాభ్యాసం వారణాసి గున్నయ్య వద్ద సాగింది. విజయనగరంలోని మహారాజా కళాశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. ఆ కళాశాలలో గిడుగు, గురజాడ సహాధ్యాయులే. మెట్రిక్యులేషన్ పూర్తయిన తర్వాత రామ్మూర్తి.. గుమస్తా ఉద్యోగంలో చేరారు. ఐదు రూపాయల అదనపు జీతం కోసం పర్లాకిమిడిలో ఉపాధ్యాయునిగా చేరారు. ఆ నిర్ణయం ఒక విధంగా ఆయన జీవితాన్నే మార్చేసింది. కొండకోనల్లోని గిరిజనుల భాష రామ్మూర్తిని బాగా ఆకట్టుకుంది. 1905లో సవరల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయించారు. దీని కోసం తన సొంత సొమ్మును కూడా ఖర్చుచేశారు. సవర భాషకు గిడుగు చేసిన సేవలు వెలకట్టలేనివి. తెలుగు, సవర భాష నిఘంటువులు రచించారు. 1930లో సవర భాషకు వర్ణణాత్మక వ్యాకరణాన్ని రాశారు. తన 16వ ఏటనే అన్నపూర్ణతో గిడుగుకు వివాహమైంది. ఎఫ్ఏ ఉత్తీర్ణుడైన తర్వాత హైస్కూల్ ఉపాధ్యాయునిగా మారారు. ఆ తర్వాత చరిత్రలో బీఏ పట్టభద్రులయ్యారు. పర్లాకిమిడి రాజా వారి కళాశాలలో చరిత్ర పాఠాలను బోధించే అవకాశం వచ్చింది.

వ్యవహారిక భాష కోసం..

గ్రాంథికం కాకుండా మనం మాట్లాడుకునే భాషే వ్యవహారిక భాషగా ఉండాలని రామ్మూర్తి పంతులు పట్టుబట్టారు. తొలుత గురజాడ, ఏట్స్ దొర, శ్రీనివాస అయ్యంగార్ లాంటి వాళ్లతో కలిసి పనిచేశారు. గురజాడ మరణించిన తర్వాత ఏకంగా రెండు దశాబ్దాలకు పైగా ఒంటరి పోరాటమే చేశారు. ఆ రోజుల్లో ఆయన కుమారుడు సీతాపతే ఆయనకి అండగా నిలిచారు. వ్యవహారిక భాషలోనే గ్రంథ రచన, బోధన కూడా ఉండాలని ఉద్యమరీతిలో ముందుకు సాగారు. తెలుగు సాహిత్యంలో గిడుగుకు అనంత ఖ్యాతిని తెచ్చిన అంశాల్లో ఒకటి సవర భాషకు చేసిన కృషి. రెండోది వ్యవహారిక భాషా సేవ.

గిడుగు సేవలకు గౌరవంగా..

30 ఏళ్ల సర్వీసు పూర్తికాగానే అధ్యాపక వృత్తి నుంచి 1911లో ఆయన స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. సవర భాషకు చేసిన కృషికి గాను 1913లో మద్రాసు ప్రభుత్వం రావు సాహెబ్ బహదూర్ బిరుదును ఇచ్చి గౌరవించింది. 1919లో గిడుగు తెలుగు అనే మాస పత్రికను స్థాపించారు. సవరులకు గిడుగు చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి 1934లో కైజర్ ఇ హింద బంగారు పతకంతో సత్కరించింది. గాంగ వంశీయుల గురించి ఇంగ్లీష్‌లో ఆయన రాసిన ప్రామాణిక వ్యాసాలు మద్రాస్ లిటరేచర్ జర్నల్ ప్రచురించింది. 1936, ఏప్రిల్ 1న పర్లాకిమిడిని విడిచి రాజమండ్రికి చేరుకున్నారు గిడుగు. 1938లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు కళాప్రపూర్ణ బిరుదుతో గౌరవించింది. ఆరోగ్యం సరిగా లేని కారణంగా ఆయన్ను కుటుంబ సభ్యులు చెన్నైకు తీసుకువెళ్లారు. అక్కడే ఆయన 1940 జనవరి 22న కుమారుడు సీతాపతి ఇంట్లో కన్నుమూశారు.


తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆమదాలవలసకు చెందిన కవి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కుప్పిలి వెంకటరాజారావు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలతో ఆయన చిత్రాన్ని గీసిన దృశ్యం.


నరసన్నపేట: సత్యవరం పాఠశాలలో ఆవరణలో గిడుగు అనే తెలుగు అక్షరమాల రూపంలో విద్యార్థులు

అమెరికాలో ఇచ్ఛాపురం విద్యార్థి మృతి

- సరస్సులో ఫొటోలు తీసుకుంటుండగా ప్రమాదం
- రాయిపైనుంచి జారిపడి మృత్యువాత
- ఎమ్మెస్ చేయడానికి 10 నెలల కిందటే వెళ్లిన వైనం


రూపక్‌రెడ్డి (ఫైల్)

ఇచ్ఛాపురం, ఆగస్టు 28: అమెరికాలో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పి.రూపక్‌రెడ్డి (26) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూపక్ రెడ్డి ఎమ్మెస్ సాఫ్ట్‌వేర్ చేయడానికి 10 నెలల కిందట అమెరికా వెళ్లాడు. హరీష్ బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎమ్మెస్ చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన స్నేహితులు ఐదుగురితో కలసి రూపక్ ఓ సరస్సులో బోటింగ్‌కు వెళ్లాడు. సరస్సు మధ్యలో ఉన్న రాయిపైకి ఎక్కి ఫొటోలు తీసుకుంటుండగా రూపక్ రెడ్డితో పాటు స్నేహితుడు రాజీవ్ సరస్సులోకి జారిపోయారు. మిగతా స్నేహితులు రాజీవ్‌ను కాపాడినా, రూపక్‌ను మాత్రం రక్షించలేకపోయారు. దీనిపై అక్కడి పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో రిస్క్యూటీం సభ్యులు వచ్చి గాలించగా రూపక్ రెడ్డి మృతదేహం లభించింది.

ఇచ్ఛాపురంలో విషాదం..

రూపక్‌రెడ్డి తండ్రి కవిరాజ్‌రెడ్డి ఇచ్ఛాపురం మండలం మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒడియా స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తు న్నాడు. తల్లి ధనవతి సంగీత కళాకారిణి. రూపక్ ఇచ్ఛాపురంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. ఇంటర్ విశాఖలోని ప్రైవేటు కళాశాలలో, బీటెక్ రాజాం జీఎంఆర్ కళాశాలలో పూర్తిచేశారు. ఆ కాలేజీలో సంజీవ్ అనే విద్యార్థితో స్నేహం ఏర్పడింది. వీరిద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్. బీటెక్ పూర్తయిన తరువాత ఎంఎస్ చేయడానికి ఇద్దరూ అమెరికా వెళ్లారు. రూపక్ ప్రతీ రోజు ఉదయం లేదా రాత్రి తన తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడేవాడు. మంగళవారం ఉదయం కూడా తనతో ఫోన్‌లో సరదాగా మాట్లాడినట్లు తండ్రి తెలిపారు. మంగళవారం సాయంత్రం బీచ్‌కు వెళ్లి బోటు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. కుమార్తె ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీకి ప్రిపేరు అవుతుంది.

ఇచ్ఛాపురంలో కంపించిన భూమి

- సెకను పాటు ప్రకంపనలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 28: ఇచ్ఛాపురం పట్టణంలో బుధవారం వేకువ జామున 3.45గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. ఒక సెకను పాటు ప్రకంపనలు వచ్చాయి. దీంతో వేకువ జామున నిద్రలేచిన వృద్ధులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో అందరూ గాఢ నిద్రలో ఉండడంతో ఎవరూ భూప్రకంపనలను గుర్తించలేకపోయారు. తరువాత విషయం తెలుసుకున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

భయపడ్డాను..

నేను ప్రతీరోజు మాదిరిగానే బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో నిద్రలేచాను. మటన్ కొట్టుకు వెళ్లేందుకు బయలు దేరాను. సుమారు 3.45 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించింది. ఒక్క సెకను మాత్రమే భూమి కంపించింది. బయటకు వచ్చి చూసేసరికి భూమి కదిలినట్లయింది. భయపడి ఇంట్లోకి వెళ్లి పోయాను. మళ్లీ 4.05 గంటలకు మరోసారి భూమి కంపించింది. అప్పటికి ప్రజలంతా గాఢనిద్రలోఉండడంతో ఎవరూ ఈ శబ్దాలను గుర్తించలేకపోయారు.

-ఎండీ ముక్తార్ హుస్సేన్, మటన్ కొట్టు వ్యాపారి, ఇచ్ఛాపురం

జిల్లాకు మూడు ప్రైవేటు ఎఫ్ఎం స్టేషన్లు

- ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో కొత్తగా మూడు ప్రైవేటు ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. దేశ వ్యాప్తంగా 234 నగరాలు, పట్టణాల్లో ఎఫ్ఎం సేవలను ప్రారంభించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మాతృభాషలో స్థానిక కంటెంట్‌ను పెంచడమేకాకుండా, కొత్తగా ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు వీలు కల్పించింది. రూ.784.87 కోట్ల నిధులతో ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో ఫేజ్ ఇల్ పాలసీ కింద 234 కొత్త నగరాలు, పట్టణాల్లో 730 చానెల్స్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి ఈ-వేలంకు ప్రతిపాదనలు చేయగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షత వహించిన కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. త్వరలో మూడు ఎఫ్ఎం స్టేషన్లు జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి.





ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్ఆర్ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, ... ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి

అడ్మిషన్స్

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

- మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

నిమ్స్‌లో ఎంహెచ్ఎం

రిమైండర్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2న
- **ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 5
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 9 నుంచి
- **వెబ్‌సైట్:** www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్దిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్దిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్దిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నూ.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితేశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతుల్లేకుండా కొండ తవ్వితే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వజ్రపుకొత్తూరు: అనుమతులు లేకుండా కొండల తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో తరిగిపోతున్న అనంతగిరి' శీర్షికతో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. తవ్వకాలు జరుగుతున్న అనంతగిరి కొండ ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఎవరి ఇష్ట మొచ్చినట్లు వారు కొండలు తవ్వితే పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆమెను కలిసి వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చారని, ఇళ్ల స్థలాలిస్తామని చెప్పి ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేశారని వినతి పత్రం అందించారు. ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతిరావు, దుర్యోధన రెడ్డి పాల్గొన్నారు.


అనంతగిరిని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాల

విద్యుత్ భారం తగ్గించాలి

టెక్కలి: అదానీ స్మార్ట్‌మీటర్లు ఆపాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం బషీరాబాద్ కాల్పుల్లో అమరులైన వారికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఉద్యమ ఫలితంగా కొన్నేళ్ల పాటు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచలేదని, కాని నేడు విద్యుత్ రంగంలో మార్పులు తీసుకువచ్చి ప్రజలపై భారం వేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు విద్యుత్ బాదుడు ఆపుతామని కూటమి నేతలు హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదని, కనీసం సర్దుబాటు చార్జీలు కూడా రద్దు చేయలేదన్నారు. కార్యక్రమంలో నేతలు హెచ్.ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతో రుజువు చేసుకోవాలి: డీఆర్‌డీఏ పీడీ

కోటబొమ్మాళి: మండలం దంత గ్రామంలో 72 మంది నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారని మంగళవారం నిర్వహించిన ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. ఈ నేప థ్యంలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ సదరం వైద్య బృందంతో గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. 320 పింఛన్లకు గాను 72 దివ్యాంగ పింఛన్లు ఉన్నట్లు రుజువు కాగా అధికారులు నిర్వహించిన దర్యాప్తులో కేవలం 22 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. మిగిలిన వారు జిల్లా మెడికల్ బోర్డుకు సదరం ధ్రువపత్రాలతో హాజరుకావాలని లేకుంటే పింఛన్లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తులో కేవలం 12 మంది అర్హత కలిగిన దివ్యాంగులు ఉన్నారన్నారు. మిగిలిన 60 పింఛన్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలని తెలుస్తోందని, వీటిలో 8 మత్స్యకార పింఛన్లుగా నమోదయ్యాయని, అసలు ఈ గ్రామంలో మత్స్యకారులే లేని గ్రామస్థులు తెలిపారన్నారు. అందరూ ధ్రువపత్రాలతో రుజువు చేసు కుంటే వారి పింఛన్లు కొనసాగిస్తామని లేకుంటే నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో డిజేబుల్డ్ వెల్ఫేర్ ఏడీ కవిత, ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారా మిలటరీ సిబ్బంది సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: దేశ రక్షణలో సేవలందించే పారా మిలటరీ సిబ్బంది సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పైడితల్లి ఆలయం సమీపంలో పారా మిలటరీల అసోషియేషన్ సంక్షేమ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణలో కీలక భూమిక పోషిస్తున్న పారా మిలటరీ సైనికులకు సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ద్వారా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.రామారావు, యాళ్ల అప్పలనాయుడు, రణబీర్ సింగ్, చింతాడ రంగనాథం, కేవీఆర్ మూర్తి, అట్ల సుమన్, గంగిట్ల శ్రీనివాసరావు, డోల నాగరాజు, టీడీపీ నాయకులు గొద్దు చిట్టి బాబు, శిమ్మ చంద్రశేఖర్, భైరి భాస్కరరావు, పీస కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● దివ్యాంగులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం 18వ వార్షికోత్సవం సందర్భంగా సంఘ భవనం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హరినారాయణ, దాసరి ఆదినారాయణ, ఉణ్న సాయికుమార్, పట్ట చిన్నబాబు, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర తెలిపారు. బుధవారం నిర్వాసిత గ్రామాలైన దాసుపురం, చీపురుపల్లి గ్రామాల్లో పర్యటించారు. దాసుపురం గ్రామంలో నిర్వాసిత కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరిగినా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. రోడ్లు, తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. చీపురుపల్లి గ్రామానికి చెందిన 73 మంది ఇళ్ల నిర్మించినా విద్యుత్ సదుపాయం లేదని, తాగునీరు అందడం నిర్వాసితులు పేర్కొనగా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో తెలిపారు. 14 మందికి నష్టపరిహారం అందలేదని బాధితులు పేర్కొనగా జాబితా పరిశీలించి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.హనుమంతరావు, ఎంపీడీవో చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

పశుగణన విజయవంతం చేయండి

పాతపట్నం: అఖిల భారత పశుగణన విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో పేడాడ జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుగణనపై బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు ఒకటి నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి పశుగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు, పశు వైద్యాధికారులు పి.అనిల్, బి.శ్రీవాణి, మౌనిక, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ

కొత్తూరు: పాతపట్నంలో ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన జరిగిన ప్రజాదర్బార్‌లో పారాపురం గ్రామంలో ఉపాధి వేతనదారుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ రవి సొమ్ములు వసూలు చేశారని గ్రామస్థులు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉపాధి ఏపీడీ రాధ ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి వేతనదారులతో విచారణ చేపట్టారు. విచారణ జరుగుతున్న సమయంలో వాగ్వాదాలు చోటుచేసుకోగా పోలీసులు చేరుకొని సద్దుమణిగించారు. విచారణలో ఎంపీడీవో పావని, ఏపీవో ప్రేమలత, సర్పంచ్ కుంచాల రత్నాలు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మెళియాపుట్టి: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పరశురాపురం గ్రామానికి చెంది న రైతులు లండ వెంకటరావు తదితరులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కోరారు. ఈ మేరకు బుధవారం గుంటూరులో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. గత 30 ఏళ్ల నుంచి సాగు ఒకరిది, పట్టాలి ఒకరికి ఇవ్వడం జరిగిందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు విధంగా కృషి చేయాలని కోరారు.

గిరిజన పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

నందిగాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన పథకాలపై అవగాహన కలిగించుకోవాలని ఎంపీడీవో టి.రాజారావు అన్నారు. బుధవారం కల్లాడ పంచాయతీ భర్తుపురం, మల్లివీడు, కందుల గూడేం గిరిజన గ్రామాల్లో ప్రజలకు పీవీటీజీ పథకాలపై అవగాహన కలిగించారు. ఉపాధి ఏపీవో ఎం.నాగరాజు, ఐసీడీఎస్ ఎస్‌వో జలజాక్షి పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిలో అంధకారం

- ● ఉక్కపోతకు గురైన నవజాత శిశువులు
- ● 2 గంటల పాటు నరకయాతన పడిన రోగులు
- ● ఇదీ నరసన్నపేట సీహెచ్‌సీలో పరిస్థితి

నరసన్నపేట: నరసన్నపేట వంద పడకల ఆసుపత్రిలో సుమారు రెండు గంటల పాటు రోగులు, నవజాత శిశువులు ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. సాయంత్రం గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 6.30 గంటల నుంచి 8.30 గంటలు వరకు వంద పడకల ఆసుపత్రి పరిసరాల్లో విద్యుత్ లేకపోవడంతో రోగులు, శిశువులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసీపీ హయాంలో ఆసుపత్రిలో జనరేటర్ వేసే లైన్లు ఆసుపత్రి అభి వృద్ధి పనుల నిమిత్తం తొలగించి ఏరే చోటికి మార్చినప్పటికీ ఆ తరువాత లైన్ అనుసంధానం చేయక పోవడంతో సుమారు రెండు గంటల పాటు నరక యాతన పడ్డారు. మొబైల్ వెలుగు లోనే సిబ్బంది సైతం సేవలందించారు. ఆసుపత్రిలో ఇన్వర్టర్ ఉన్నా అది వైద్యులు గదులకు, అత్యవసర విభాగానికే పరిమితం కావడంతో మిగిలిన ఆసుపత్రి ఆవ రణ అంతా చిమ్మ చీకటిలోనే మగ్గాల్సిన పరిస్థితి ఎదురైంది. ఒక పక్క దోమల మోత.. మరో పక్క ఉక్కపోతతో రోగులు, వారి సహాయకులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ఇటీవల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆసుపత్రికి జనరేటర్ సదుపాయం పునరుద్ధరించాలని ఆదేశించినా ఆసుపత్రి అధికారులు పట్టించు కోకపోవడం గమనా ర్హం. ఈవిషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ జయశ్రీ వద్ద ప్రస్తావించగా జనరేటర్ నుంచి ఆసుపత్రికి కేబుల్ వేసేందుకు రూ.1.8 లక్షల వ్యయమవు తుందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి ఈ మొత్తం ఖర్చు చేసేందుకు అవకాశం లేదని, కలెక్టర్, డీసీహెచ్ఎస్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాశామన్నారు. వారి నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు.


ప్రసూతి వార్డులో ఉక్కపోతకు గురైన నవజాతి శిశువులు

గిరిజన సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

- ● ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్

పాతపట్నం: క్షేత్రస్థాయిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. బుధవారం బైదలాపురం పీహెచ్‌సీ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై బోధన, మెనూ తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. బైదలాపురం పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలు, ప్రసవాలు తదితర అంశాలపై వైద్యాధికారి సదాశివను ప్రశ్నించారు. వైద్యురాలుసత్యవాణి దీర్ఘకాలంగా విధులకు హాజరు కావడంలేదంటూ స్థానిక గిరిజనులు ఆయనకు ఫిర్యాదు చేశారు. నల్లబొంతు గిరిజన గ్రామంలో పర్యటించారు. గ్రామంలో మౌలిక వసతులతో పాటు శ్మశాన వాటిక లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. అలాగే పాఠశాల ఓ ప్రైవేటు గృహంలో నిర్వహిస్తున్నారని స్థానికులు పేర్కొనగా ఈ విషయా లన్నింటిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వడిత్య శంకర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యశంకర్ నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

మండల పరిషత్ వార్షిక ఆడిట్

మందస: మండలానికి 2023-24 ఆర్థిక సంవత్సంలో మంజూరైన నిధులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆడిట్ నిర్వహించారు. జిల్లా ఆడిట్ అధికారి ఎస్.వేణుగోపాల్, సీనియర్ ఆడిటర్ బి.ప్రతాప్ ఆధ్వర్యంలో మండలానికి మంజూరైన 15వ ఆర్థికసంఘ నిధులు మంజూరు, ఖర్చు, సాధారణ నిధులపై రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో బి.రుషేశ్వరరావు పాల్గొన్నారు.

2న రక్తదాన శిబిరం

టెక్కలి: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 2న పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ టెక్కలి నియోజ కవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సంతబొమ్మాళి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్కే దాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా నౌపడ పీహెచ్‌సీ వైద్యాధికారి పరిమళ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఒకసారి విద్యార్థులకు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 320 విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి వారిలో 44 మందికి దృష్టి కోపం ఉన్నట్లు గుర్తించారు.


నేత్రదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు

కొత్తూరు: నేత్రదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని మెట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు పేర్కొన్నారు. 39వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాంగా కలిగాం గ్రామంలో బుధవారం ప్రజలకు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. నేత్రదానంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఆప్తాలమిక్ అధికారి ఇప్పిలి జానకిరామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించారు. వీరికి కళ్లద్దాలు అందించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిగా జగన్నాథరావు

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ కార్యదర్శిగా కేవీవీ జగన్నాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను రోడ్లపై వేయ వద్దని, పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు తడి, పొడిచెత్తను వేరు చేసి అందించాలన్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు.

ఎస్ఐగా లావణ్య



పాతపట్నం: ఎస్ఐగా బి.లావణ్య బుధవారం బాధ్య తలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన మహమ్మద్ యాశిన్ హిరమండలానికి బదిలీ అయ్యారు. లావణ్య పార్వతీపురం మన్యం జిల్లాలో దిశ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమె గతంలో సారవకోట ఎస్ఐగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి సిబ్బంది అభినందించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ట్రాఫిక్, నేర నియంత్రణలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు: నేరడి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి రూ.20 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఏ గ్రామంలోనైనా ఆలయాలు నిర్మించాలన్న సంకల్పం ఉంటే తన వంతు సాయమందిస్తానన్నారు. కార్యక్రమంలో గరుకు యతిరాజు, శ్రీనివాస్, అగతముడి మాధవరావు, అరుణ్, టీడీపీ మండల అధ్యక్షుడు మాతల గాంధీ పాల్గొన్నారు.

రూ.7.72లక్షల రికవరీకి పీడీ ఆదేశం

కోటబొమ్మాళి: సామాజిక తనిఖీ ప్రజావేదికలో అక్రమాలు జరిగినట్లు వెల్లడైనందున బాధ్యుల నుంచి రూ.7,72,00 రికవరీ చేయాలని డ్వామా పీడీ ఆదేశించారని ఏపీవో జి.హరిప్రసాద్ తెలిపారు. మండలంలో 38 పంచాయతీలకు గాను నాలుగు మినహా మిగిలిన 34 పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనుల్లో అక్రమాలు జరిగాయని ప్రజావేదికలో రుజువైందన్నారు. మండలంలో వేతనాలకు గాను రూ.21 కోట్లు చెల్లింపులు కాగా పంచాయతీరాజ్ పనుల్లో భవనాలు, సీసీ రోడ్లు, ప్రహరీ వంటి పనులతో పాటు వన సంరక్షణ వంటి పనులకు రూ.3 కోట్లు చెల్లించారన్నారు. ఈ పనుల్లో అక్ర మాలు జరిగినట్లు క్షేత్రస్థాయిలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో వెల్లడైందని, బాధ్యుల నుంచి రూ.7.72 లక్షలు రికవరీ చేయాలన్నారు.

'ఆపరేషన్ కాగర్' కుట్రను ఎదుర్కోవాలి

పలాసరూరల్: మధ్య భారతంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆపరేషన్ కాగర్' కుట్రను ప్రతిఘటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు తాండ్ర ప్రకాష్ అన్నారు. సెప్టెంబరు 10న పెద గంతారులో నిర్వహించనున్న కుమారన్న, సీతారాముల వర్ధంతి సభ పోస్టర్లను బుధవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆవిష్కరించారు. పి.మల్లేశ్వరరావు, ఆర్.మాధవరావు, కామేష్ పాల్గొన్నారు.

పది రోజుల్లో 'ఏకలవ్య' పనులు పూర్తి చేయాలి

మెళియాపుట్టి: ఏకలవ్య పాఠశాల పనులు పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రమణ తెలిపారు. మెళియాపుట్టిలో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిందని, తక్షణం పూర్తికి చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు

నరసన్నపేట: తామరాపల్లి రెసిడెన్షియల్ కళాశాలలో ఎలుకలను నివారించేందుకు చర్యలు తీసు కోవాలని పశుసంవర్థక శాఖ జేడీ వి.జయరాజు ఆదేశించారు. ఎలుకలు కరిచి ఐదుగురు విద్యార్థినులు గాయపడిన నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో బుధవారం అధికారులు కళాశాలను సందర్శించారు. ఎలుకల బోనులను ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స పొందిన వారి ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ● ఇదిలా ఉండగా కళాశాలలో సోమవారం రాత్రి ఐదుగురు విద్యార్థినులకు ఎలుకలు కరిచిన విషయం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించారు. విద్యార్థినులు పడుకునే గదుల కిటికీలకు, వెంటిలెటర్లకు మెస్‌లను ఏర్పాటు చేశారు. బయట నుంచి ఎలుకలు, విష కీటకాలు రాకుండా గోడలకు ఉన్న రంధ్రాలకు సిమెంట్‌తో మూయించారు.

యూపీఎస్ పెన్షన్ విధానం వద్దు

పోలాకి: సీపీఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూపీఎస్ పెన్షన్ విధానం సరైంది కాదని, పాత పెన్షన్ విధానమే కొనసాగించాలని పోలాకి మండల యూటీఎఫ్ నాయకులు రాజేష్, ఉమాభాస్కర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 30న అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు తెలుతామన్నారు. 117 జీవోను రద్దు చేయకుండా టీడీపీ తాత్సారం చేస్తోందని విమర్శించారు. యూటీఎఫ్ నాయకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పిత్తనాళపు క్యాన్సర్‌కు జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

పలాస: పలాస నియోజకవర్గానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో పిత్తనాళపు క్యాన్సర్‌తో బాధపడుతుండగా గుర్తించి అరుదైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు బుధవారం జెమ్స్ నిర్వాహకులు ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా సదరు మహిళ తీవ్రమైన పచ్చ కామెర్లతో బాధపడుతూ జెమ్స్‌లో చికిత్స కోసం వచ్చారు. వైద్యులు పిత్తనాళపు క్యాన్సర్‌గా గుర్తించి లీవర్ కుడి భాగాన్ని ప్రేగుతో జతచేసి ఆపరేషన్ చేశారు. అదేవిధంగా ఒడిశాకు చెందిన 65 ఏళ్ల వయసున్న ఒక మహిళ కూడా ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరింది. హెపటైటీస్-బి, లీవర్ కుడి భాగంలో రక్తనాళపు గడ్డ వ్యాధిగా గుర్తించిన వైద్యాధికారులు లీవర్ కుడిభాగంలో ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో తొలిసారిగా ఇటువంటి అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. జెమ్స్ గ్యాస్ట్రో వైద్యులు మూడడ్ల రోహిత్, ఆర్.స్వామినాయుడు ఈ శస్త్రచికిత్సలు చేయగా క్రిటికల్ కేర్ సిబ్బంది, సహకరించారు. రూ.లక్షల ఖర్చయ్యే ఈ వైద్యాన్ని డాక్టర్ ఎన్టీయార్ వైద్యసేవ, బీఎస్‌కెవై పథకాల ద్వారా ఉచితంగా నిర్వహించామని వైద్యులు రోహిత్, స్వామినాయుడు, జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ శివస్వేష్ తెలిపారు.


ఒడిశాకు చెందిన మహిళతో జెమ్స్ వైద్యాధికారులు

పాఠశాలకు గేటు వితరణ

పలాస: రామకృష్ణాపురం సత్య సాయి విద్యావిహార్ పాఠశాలకు లయన్స్‌క్లబ్ ప్రతినిధి, ప్రముఖ వ్యాపారవేత్త డోకి రామారావు దంప తులు రూ.60 వేలు విలువైన గేటును అందిచారు. ఈ మేరకు బుధవారం గేటును ప్రారంభించారు. అదేవిధంగా సత్యసాయి మందిరానికి అన్నదానం కోసం రూ.2,700 అందించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి రూ.12,200 విలువైన గేటును డి.శారదా రాజేష్ సౌజన్యంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. క్లబ్ అధ్యక్షుడు హెచ్‌వై.దొర, కార్యదర్శి ఎన్.అప్పారావు, బీనాగే శ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, విద్యావిహార్ కన్వీనర్ మల్లా రామేశ్వరరావు పాల్గొన్నారు.


పాఠశాల గేటును ప్రారంభిస్తున్న డోకి రామారావు దంపతులు

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

జలుమూరు (సారవకోట): బురుజువాడ గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో మంగళవాయిద్యాల నడుమ శ్రీనీలమణి దుర్గమ్మ, చెవిటమ్మ తల్లి గ్రామ దేవతల ఆలయాలకు చేరుకుని ముర్రాటలతో చల్లదనం చేశారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.




ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజారాంపురం(పోలాకి): రాజారాంపురం బీచ్ రోడ్డు వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రంజిత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనిఖీ సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి వివరాలు సేకరించగా ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

భారీ వర్షంతో రైతుల్లో హర్షం

పలాసరూరల్/ మందస/ నందిగాం/ పోలాకి/ ఎల్ఎన్‌పేట/ జలుమూరు: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం, సాయంత్రం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు వీచాయి. పలాస, మందస, నందిగాం, పోలాకి, ఎల్ఎన్‌పేట, జలుమూరు మండలాల్లో కురిసిన వర్షంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇటీవల కొన్ని రోజులుగా వర్షం కురవక పోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఎదురవగా ఈ వర్షం ఊపిరి పోసిందని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందనే సమాచారంతో పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇదిలా ఉండగా నందిగాం మండలంలో కురిసిన భారీ వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 16కిలోమీటర్ల పొడవున ఉన్న మార్గంలో ఒక్కడా షెల్టర్లు లేకపోవడంతో అండర్ పాసేజ్‌ల కిందే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది.


నందిగాం: భారీ వర్షంతో నర్సిపురం అండర్‌పాసేజ్ దిగువున వేచివున్న వాహనచోదకులు, ప్రయాణికులు



జలుమూరు, ఎల్ఎన్‌పేట మండలాల్లో కురుస్తున్న వర్షం

పిడుగు పడి మహిళ మృతి

ఇచ్ఛాపురం: ముచ్చింద్ర గ్రామానికి చెందిన తాడి జానకమ్మ(45) పిడుగుపాటుకు గురై మృతి చెందారు. బుధవారం వరినాట్లు వేయడానికి పొలానికి వెళ్లింది. సాయంత్రం వర్షంతోపాటు ఉరుములు, మెరుపులులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు ఆమెపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఆమెను ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కాగా జానకమ్మకు భర్త సోమయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


అనూరాధ (ఫైల్)

నరసన్నపేట: మనస్తాపంలో ఓ వివాహిత బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నరసన్నపేట పట్టణంలో చేటుచేసుకుంది. పోలీసులు, మృతిరాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి పక్కన ఉన్న వీఎస్ఆర్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న బరాటం శ్రావణ్‌తో శ్రీకాకుళం పట్టణానికి చెందిన కిల్లంశెట్టి పద్మావతి కుమార్తె అనూరాధ (22)కు గతేడాది వివాహమైంది. ఆ తర్వాత కొద్ది రోజుల వరకు అన్యోన్యంగా ఉంటున్న కాపురంలో భార్యపై అయిష్టత ఒక వైపు.. అత్తవారి వరకట్న వేధింపులు మరోవైపు ఎక్కువవడంతో ఇంట్లో గొడవలు పడుతున్నారు. గడచిన ఏడు నెలలుగా ఈ గొడవలను భరిస్తున్న అనూరాధ బుధవారం టిఫిన్ చేసిన తర్వాత బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బెడ్‌రూంలోకి వెళ్లిన అనూరాధ ఎంతకీ రాకపోవడంతో భర్త శ్రావణ్ తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే అనూరాధ తల్లి పద్మావతికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాదరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బెడ్ రూమ్‌లో దొరికిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరకట్న వేధింపులే తన కుమార్తె మరణానికి కారణమని ఆమె తల్లి పద్మావతి ఆరోపించారు. పద్మావతి ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసుగా నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా శ్రావణ్ స్వస్థలం విశాఖ జిల్లా మధురవాడ. గత కొన్నాళ్లుగా నరసన్నపేటలో ఉంటూ బ్యాంగిల్స్ వ్యాపారం చేస్తున్నారు.

ఉరివేసుకుని కార్మికుడు..


ముస్తాక్ (ఫైల్)

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్న సక్లైన్ ముస్తాక్(26) బుధవారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీస్ కథనం మేరకు.. పశ్చింబెంగాల్ రాష్ట్రానికి చెందిన సక్లైన్ ముస్తాక్ గత కొన్ని నెలలుగా పైడిభీమవరంలోని ఓ క పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వారానికి మూడు రోజుల పాటు విధులకు వెళ్తుంటాడు. ముస్తాక్‌కు భార్య ఆరు నెలల పాప ఉంది. అయితే ముస్తాక్ బ్యాచలర్‌గా పైడిభీమవరంలో ఉంటున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల తాను డ్యూటీకి రావడం లేదని సూపర్‌వైజర్‌కు ఫోన్ ద్వారా బుధవారం ఉదయం సమాచారం ఇచ్చాడు. కాగా ముస్తాక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామని, సమీప బంధువు ఎస్కే మహుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

మడ్డివీధిలో యువకుడు..

శ్రీకాకుళం క్రైం: నగరంలోని బలగ మడ్డివీధికి చెందిన కె.భాను ప్రకాష్ (19) అనే యువకుడు బుధవారం ఆత్మహ త్య చేసుకున్నాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాను ప్రకాష్ అంబేడ్కర్ యూనివర్సిటీలో రెండో సంవత్సరం బీటెక్ చదువుతున్నారు. తల్లి మృతి చెందడంతో తండ్రి వద్దనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ప్రతి రోజులాగానే భోజనం చేసి మేడపై గదిలో పడుకునేందుకు వెళ్లాడు. బుధవారం ఉదయం 9 గంటల వరకు కిందకు రాకపోవడంతో పని మనిషి సరస్వతి తలుపుకొట్టినా ప్రకాష్ తలుపు తీయలేదు. దీంతో తండ్రి మాదవరావు కార్పెంటర్‌ను పిలిపించి బద్దలు కొట్టి చూసే సరికి ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా ప్రకాష్ కనిపించాడు. దీంతో మాదవరావు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న హరికృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే ప్రకాష్ మృతికి గల కారణాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


లిఖిత(ఫైల్)

టెక్కలి: స్థానిక సైనిక్ నగర్‌కు చెందిన కె.లిఖిత (19) రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు కుటుంబం సభ్యులు తెలిపారు. ఈ నెల 26న శ్రీకాకుళం వైపు బైక్‌పై వెళ్తుండగా నరసన్నపేట సమీపం లో రోడ్డు ప్రమాదానికి గురైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగా ఈమె స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతోంది. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. లిఖిత మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

లావేరు: తామాడ, పట్నవానిపేటల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక పోగులను బుధవారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. బుధవారం 'ఆంధ్యజ్యోతి'లో వెలువడిన 'యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' కథ నానికి అధికారులు స్పందించారు. ఎస్ఐ జి.లక్ష్మణరావు, లక్ష్మీపురం వీఆర్‌వో శ్రీనివాసరావు, తామాడ వీఆర్వో రామయ్య ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, ఇసుక పోగులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: పిడిమందస పంచాయతీ కరేపల్లి గ్రామంలో బుధవారం సీఐ జైభీం ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెల్లం ఊటలు, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ధ్వసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీలోని కొండలు, లోయల్లో సారా తయారీని అడ్డుకొని అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామని చెప్పారు. సారా తయారీ, అమ్మకాల విషయమై 9440902358 నెంబరుకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు, నాయుడు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈవో ధనుంజయ

కవిటి: విద్యార్థులు రాబోయే తరానికి మార్గదర్శకులుగా ఉండాలని ఎంఈవో ధనుంజయ మజ్జి కోరారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి సమాజం నిర్మాణానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నతపాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో జి.పాపారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడి గెస్ట్‌హౌస్‌లో జూదం

- ఎస్పీకి సమాచారం.. ఎస్బీ సిబ్బంది దాడి
- ఆరుగురి అరెస్ట్.. రూ.3,23,500 స్వాధీనం
- డాక్టర్‌ను తప్పించారంటూ ఆరోపణలు..

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలోని కుశాలపురం గ్రామంలో ఉన్న నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడి గెస్ట్‌హౌస్‌లో జూదమాడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డికి ఈ గెస్ట్‌హౌస్‌లో పేకాడుతున్నట్టు పక్కా సమాచారం రావడంతో.. ఆయన ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం రాత్రి 9.30కి దాడులు నిర్వహించారు. గెస్ట్‌హౌస్‌లోని ఓ గదిలో అంధవరపు శ్రీనివాసరావు, బరాటం ఆదినారాయణ, పప్పల నర్సింహమూర్తి, బాలభద్రుని రామ్‌కుమార్, బరాటం శ్రీరామమూర్తి, గేదెల వాసుదేవరావు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వీరి నుంచి పేకాట కాయిన్లు, రూ.3.23,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని ఎటీ అధికారులు రణస్థలం సీఐ ఎం.అవతారం అప్పగించారు. వారిని అదుపులోకి తీసుకుని సీఐ కేసు నమోదు చేశారు.

ఎచ్చెర్ల పోలీసుల తీరుపై అనుమానాలు

ఇంత పెద్ద స్థాయిలో పేకాట జరుగుతుండగా, ఎచ్చెర్ల పోలీసులకు కనీసం సమాచారం లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా పోలీసు బాసే తన నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరించి, స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో దాడులు నిర్వహించడం, మూడు లక్షలకు పైగా నగదుతో పేకాటరాయుళ్లు పట్టుబడడంతో ఎచ్చెర్ల పోలీసుల పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దాడిలో గెస్ట్‌హౌస్ యజమాని అయిన ప్రముఖ వైద్యుడు పట్టుబడినా, కేసు నుంచి తప్పించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి పట్టుబడింది తొమ్మిది మంది అని, అరెస్టు చూపించింది మాత్రం ఆరుగురిపైనే అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ గెస్ట్‌హౌస్ నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడిదిగా రణస్థలం సీఐ అవతారం తెలిపారు. పేకాట జరుగుతున్న స్థావరంపై దాడులు చేసిన సమయంలో పేకారాయుళ్లతో పాటు, నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలతో పాటు, ఆ భవనం యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం, విచారించడం పరిపాటి. కానీ ఈ కేసులో గెస్ట్‌హౌస్ యజమాని ప్రముఖ వైద్యుడు, ఓ పార్టీ నాయకుడు కావడంతో అతడిపై చర్యలకు పోలీసులు వెనుకాడుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ రజని తదితరులు

ఎచ్చెర్ల: గంజాయి, మద్యం, ధూమపానం తదితర వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం మత్తు పదార్థాల వినియోగం- నష్టాలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాల కళాశాల (శ్రీకాకుళం) సైకాట్రియా విభాగం అధ్యాపకురాలు అఖిల, విద్యా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రసాద్ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రిజిస్ట్రార్ పి.సుజాత, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

బూర్జ: గిరిజనుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ అన్నారు. అల్లిపల్లిగూడ గిరిజన గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి జీవనోపాధి, సదుపాయాలపై ఆరా తీశారు. స్థానిక సమస్యలపై సర్పంచ్ వెంకటసత్యంను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు తదితర సమస్యలను కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. కమిషన్ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్ని సంబంధిత అధికారులకు వివరించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామానికి 15 రోజుల్లో శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తానని తహసీల్దార్ ఈశ్వరమ్మ హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, మండల ఆదివాసీ పరిషత్ అధ్యక్షుడు సవర శోభన్, ఉపాధ్యక్షులు కృష్ణ, కోశాధికారి సింహాచలం, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో రాజ్‌కుమార్, ఎస్ఐ ఎం.ప్రవల్లిక, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..


ప్రమాదకరంగా ఉన్న ఎండిపోయిన చెట్టు

గార: కుమ్మరిపేట వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పక్కక ప్రమాదకరంగా ఎండిపోయిన పెద్ద చెట్టు ఉంది. నిత్యమూ రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎండిపోయిన ఈ చెట్టును తొలగించకుండా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ చెట్టుకు కింద నుంచి విద్యుత్ లైన్లు కూడా ఉండడంతో ఏ మాత్రం గాలి వేసినా చెట్టు కొమ్మలు విరిగి పడి ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సుందర శ్రీకాకుళమే లక్ష్యం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: సుందర శ్రీకాకుళం నగరం నిర్మాణమే లక్ష్యంగా అందరం పనిచేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని బలగ, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, మేజర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీస మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నగరంలోని అన్ని డివిజన్లలోని కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయించామన్నారు. నగర కమిషనర్ చల్లా ఓబులేసు, నగర పాలక సంస్థ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిక్కోలులో 'తెలుగు'వారు



తెలుగు ముసలయ్య కాలనీ బోర్డు



తెలుగు రామారావు ఇంటి బోర్డు

శ్రీకాకుళం కల్చరల్: సిక్కోలులో తెలుగువారు ఏంటా అని ఆశ్చర్యపోతున్నారా!. మరేమి లేదండి తెలుగు అనే అక్షరాలే ఇంటిపేరుగా ఉన్న కుటుంబాలు శ్రీకాకుళం నగరంలో 100 ఉన్నాయి. వీరంతా అరసవల్లి తోట సమీపంలో నివసిస్తున్నారు. ఆ కాలనీ పేరు తెలుగు ముసలయ్య కాలనీ. తెలుగు అనే ఇంటి పేరు తమ తాతతండ్రుల నుంచి ఉందని కాలనీకి చెందిన తెలుగు రామారావు (80) అనే వృద్ధుడు తెలిపాడు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ కాలనీ పేరును అందరూ తలచుకుంటున్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం: హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం తెన్నేటి తేజేశ్వరశర్మ, ఒడిశాకు చెందిన హరమోహన్ శర్మ, చంద్రభాను శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్న సమారాధన నిర్వహించారు.

పూజలు అందుకుంటున్న హనుమాన్ →



గిరిజన గ్రామాల్లో పీఎం జన్‌మన్


గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

కంచిలి: కేబీ నౌగాం పంచాయతీ పరిధిలో బుధవారం అధికారులు సర్వే చేపట్టారు. ప్రధానమంత్రి జంజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (జన్‌మన్) కార్యక్రమంలో భాగంగా కొనొకా గ్రామంలో ఎంపీడీవో వి.నీరజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు కావాల్సిన అవసరాలు గుర్తించి, వాటి పరిష్కారమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ, గృహనిర్మాణ శాఖ ఏఈ అప్పారావు, మండల పశువైద్యాధికారిణి టి.శిరీష, సర్పంచ్ జన్ని హరిబంధు, ఎంపీటీసీ సింహాచలం జన్ని, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

సోంపేట: దుకాణాల్లో బాలకార్మికులు ఉంటే చర్యలు తప్పవని సంబంధిత అధికారులు హెచ్చరించారు. పట్టణంలోని పలు షాపుల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో ఎంఈవో ఎస్.జోరాడు, కార్మికశాఖాధికారి విజయ్‌కుమార్, రాజు, ఏఎస్ఐ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టాలి

జి.సిగడాం: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అయన మాట్లాడారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న సభ్యత్వ నమోదులో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, జి.అప్పలరాజు, భాస్కరరావు, పైడిరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యాధికారి ప్రతిష్ఠశర్మ అన్నారు. బుధవారం వెలగాడలో జ్వరాలపై ఇంటింటా పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్, క్లోరినేషన్ చేయించారు. అధికారులు సురేష్, బాతువ సీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు స్టేట్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు జిల్లా గ్రామీణాభివృ సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, రామప్పడు, హరికృష్ణ, ఉమ, సుభద్ర, స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కామేశ్వరరావు, మధు, శివ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నానుబాలవారి వీధిలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో రోహిణి నక్షత్ర సందర్భంగా అర్చకులు పాండురంగ శరత్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, అదేవిధంగా, బలభద్రుని స్ఫూర్తి మాధుర్య ఆధ్వర్యంలో వెంకటేశ్వర వైభవం నృత్య ప్రదర్శన ప్రదర్శించారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి

అరసవల్లి: వలంటీర్లకు న్యాయం చేయాలని, బకాయిపడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని అందించాలని, రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నగరంలోని క్రాంతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. వలంటీర్లకు పది వేలు జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

లావేరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2012-13 సంవత్సరంలో పదో తరగతి చదుతున్న విద్యార్థులు వాలీబాల్, షటిల్, టెన్నీ కాయిట్ క్వీట్లను బుధవారం హెచ్ఎం పి.జగన్నాథరావు, పీడీ రవికుమార్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు ఆర్.లక్ష్మి, ఆశపు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పాత చట్టాలను సవరిస్తూ కొత్తచట్టాలు


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట: కొత్త చట్టాల కోసం పాత చట్టాలను చిన్నచిన్న మార్పులు చేశారని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కొన్ని కేసుల్లో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయం అందించనున్నట్టు తెలిపారు. రాబోయే కాలానికి అనుగుణంగా తమ జీవితాలను సరిదిద్దుకోవాలన్నారు. జి.ఇందిరా ప్రసాద్, టి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం


ప్రధాన రహదారిపై చేరిన వర్షపునీరు

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ప్రధానంగా రహదారులు జలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఆదిత్యాలయంలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతులను వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి సమర్పించారు.

బీటెక్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో 3,5 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసినట్టు డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. 3వ సెమిస్టర్‌కు 293 మంది విద్యార్థులు హాజరుకాగా, 238 మంది ఉత్తీర్ణులయ్యారు. 5వ సెమిస్టర్‌కు 192 మంది హాజరుకాగా, వీరిలో 149 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లో పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేయవచ్చన్నారు.

1న జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో వచ్చే నెల 1వ తేదీన జిల్లాస్థాయి ఖోఖో సబ్ జూనియర్ బాలురు, బాలికల జట్టు ఎంపికలను నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, కార్యదర్శి సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ఇండెక్స్ ప్రకారం వయస్సు, బరువు, ఎత్తు ఇలా మొత్తం 215 పాయింట్లు ఉండాలన్నారు. ఆయా క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ ప త్రంతో హాజరు కావాలన్నారు. ఇందులో ఎంపికైన వారు వచ్చే నెల 20, 21వ తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకోవాలి

కంచిలి: ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చూడాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు గృహనిర్మాణాలు పూర్తికాని లబ్ధిదారుల వివరాలు సేకరించి, నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏఈ ఎ.అప్పారావు, ఈవోపీఆర్‌డీ ఈ.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

కవిటి: బి.గొనపపుట్టుగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించినట్టు పీఈటీ బి.రమేష్ తెలిపారు. విద్యార్థులకు క్రీడాదినోత్సవ విశిష్టతను తెలియపర్చి వారికి పోటీలను ఏర్పాటు చేశామన్నారు. గురువారం క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం భవానీ పాల్గొన్నారు.

శ్రీవారి పాదాలు ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన శ్రీవారి పాదాలు

శ్రీకాకుళం కల్చరల్: శివబాలాజీ ఆలయంలో ఇలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన శ్రీవారి పాదాలు ప్రతిష్ఠాపన ఆలయ అర్చకులు శ్రీగోపి నంబాల సీతారామాచార్యులు, సత్య కూర్మాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిర్ణయం హర్షనీయం

పొందూరు: బలవంతపు మతమార్పిడిపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించడంపై హిందూ సమాజానికి మేలు చేస్తుందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. కృష్ణాపురంలోని ఆనందాశ్రమంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులు ఉండరాదని, బలవంతపు మతమార్పిడులు అడుకోవాలని పిలుపునివ్వడం ద్వారా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారన్నారు. చంద్రబాబు నిర్ణయంపై కోట్లాదిమంది హిందువులు హర్షధ్వానాలు పలుకుతున్నారన్నారు. ఏ మతస్తులు వారివారి విశ్వాసాలకు అనుగునంగా వారి మతసంస్థల్లో పనిచేయాలే తప్ప ఇతర మతసంస్థల్లో పనిచేయడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా మతమార్పిడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు చారిత్రాక నిర్ణయం హిందువుల ఆత్మభిమానాన్ని పెంచేదిగా హిందూధర్మాన్ని గౌరవించేలా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

పొందూరు: మండల పరిషత్ కార్యవర్గ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీపీ కిల్లీ ఉషారాణి తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో బుధవారం విలేఖరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే కూన రవికుమార్ తొలిసారి సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు.

హత్యా సంస్కృతి సరికాదు

ఎచ్చెర్ల: ప్రశాంతంగా ఉండే జిల్లాలో హత్యా సంస్కృతిని ప్రోత్సహించడం సరికాదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఫరీద్‌పేట గ్రామంలో ఇటీవల జరిగిన దాడిలో మృతిచెందిన కూన ప్రసాద్ కుటుంబాన్ని అయన బుధవారం పరామర్శించారు. ఈ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ జిల్లాలో ఇలాంటి భయానక సంఘటనలు మునుపెన్నడూ చూడలేదన్నారు. ఈ ఘటనతో బాధ్యులైన నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, అనకాపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతలు

పొందూరు: పొందూరు ఎస్ఐగా వి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సత్యనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా పొందూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

- **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐగా ఈ.చిన్నంనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా పార్వతీపురంలో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సత్యనారాయణ పొందూరుకు బదిలీపై వెళ్లారు. కాగా శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారిస్తానని ఎస్ఐ తెలిపారు.